RNI No: TELTEL/2022/83073


# వేద న్యూస్

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:62 | ఫిబ్రవరి 12, 2026 | వెల: రూ.3-00

దినపత్రిక



- కరీంనగర్‌లో దొంగ ఓట్ల కలకలం.. ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జ్
- జనగామలో డబ్బులివ్వలేదని పోలింగ్ కేంద్రం వద్ద మహిళల ఆందోళన
- రేపు ఫలితాలు.. 16న కొత్త పాలకవర్గాల కొలువు
- లెక్కల్లో మునిగి తేలిన ప్రధాన పార్టీలు
- ఎవరి ధీమాలో వారు..
- అభ్యర్థులను వెంటాడుతున్న క్రాస్ ఓటింగ భయం



# ముగిసిన పుర సమరం!




## బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల జాతకం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

పది రోజులుగా సాగిన మున్సిపల్ ఎన్నికల ఉత్కంఠ ఒక కీలక అంకానికి చేరుకుంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ ప్రక్రియ ముగియగా, అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నప్పటికీ, పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం కలకలం రేపింది. కరీంనగర్‌లో దొంగ ఓట్ల గొడవ లాఠీఛార్జ్‌కు దారితీయగా, జనగామలో డబ్బులు ఇవ్వలేదని మహిళా ఓటర్లు చేసిన వినూత్న నిరసన ప్రజాస్వామ్యంలో ధనప్రభావం ఏ స్థాయిలో ఉందో అద్దం పట్టింది. ఒకవైపు అధికార బలంతో క్లీన్ స్వీప్ చేస్తామని కాంగ్రెస్.., పట్టణ ఓటు బ్యాంకు తమదేనని బీఆర్ఎస్, పెరిగిన గ్రాఫ్‌తో సత్తా చాటుతామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే, లోపాయికారీ ఒప్పందాలు, క్రాస్ ఓటింగ్ భయం ఇప్పుడు ప్రధాన పార్టీల నేతలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పోలింగ్ ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు రేపు జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది.

2లో

## వార్.. వన్ సైడే!

### 90శాతం స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకి..

- పట్టణ ఓటర్ల మద్దతుతో ఘన విజయం సాధించబోతున్నాం
- ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకే ప్రజల పట్టం
- పారదర్శక పరిపాలనపై విశ్వాసమే విజయానికి కారణం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



2లో

## కాంగ్రెస్ అరాచకాలకు గులాబీ సైన్యం లొంగలేదు

- పురపాలక సమరంలో పోరాట స్ఫూర్తికి అభినందనలు
- అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- వేధింపులకు భారీ మూల్యం చెల్లించాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో

## అధికార దుర్వినియోగం దుర్మార్గం

- కాంగ్రెస్ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడింది
- బీఆర్ఎస్ అభ్యర్థులపై బెదిరింపులు సరికాదు
- మాజీ మంత్రి హరీష్ రావు

## డిప్రెషన్ ఒక్కటే కారణం కాదు

- విజయశాంతి రెడ్డి ఆత్మహత్య కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
- కుటుంబ సభ్యులు సహా 12 మందిని విచారించిన పోలీసులు
- ఫోరెన్సిక్ నివేదిక అనంతరం స్పష్టతకు అవకాశం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

విజయశాంతి రెడ్డి మృతి కేసులో డిప్రెషన్ ఒక్కటే కారణమని ప్రచారంలో ఉన్న వార్తలను పోలీసులు ఖండించారు. ఆమె కేవలం మానసిక ఆందోళన కారణంగా ఆత్మహత్య చేసుకుందని చెప్పడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. రైల్వే పోలీసులు మాట్లాడుతూ.. సూసైడ్‌కు డిప్రెషన్ మాత్రమే కారణం కాదని పేర్కొన్నారు. ఘటనకు దారితీసిన ఇతర అంశాలపై కూడా విచారణ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు కుటుంబ సభ్యులు సహా మొత్తం 12 మందిని విచారించినట్లు తెలిపారు. ఆఫీసులో ఆమెతో కలిసి పనిచేసిన సహోద్యోగుల వాంగ్మూలాలను కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. వ్యక్తిగత, వృత్తి సంబంధిత అంశాలను పరిశీలిస్తూ దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత కేసులోని చిక్కుముడి వీడే అవకాశముందని పోలీసులు తెలిపారు. అన్ని ఆధారాలను పరిశీలించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

## యూరియా కోసం రోడ్డెక్కే దుస్థితి

ఎన్నికల మోజులో రైతులను మర్చిపోయిన రాష్ట్ర ప్రభుత్వం

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



2లో

# వార్.. వన్ సైడే!

## 90శాతం స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకి

- పట్టణ ఓటర్ల మద్దతుతో ఘన విజయం సాధించబోతున్నాం
- ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకే ప్రజల పట్టం
- పారదర్శక పరిపాలనపై విశ్వాసమే విజయానికి కారణం
- టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించబోతోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబాటు కాంగ్రెస్ పట్ల విశ్వాసాన్ని బలపరిచాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై తీసుకున్న చర్యలు సానుకూల ప్రభావం చూపాయని తెలిపారు. ప్రజలు ఇచ్చిన మద్దతు బాధ్యతను మరింత పెంచిందని పేర్కొంటూ, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వంగా కాంగ్రెస్ నిలుస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులు, అభ్యర్థులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ అరాచకాలకు గులాబీ సైన్యం లొంగలేదు

- పురపాలక సమరంలో పోరాట స్ఫూర్తికి అభినందనలు
- అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- వేధింపులకు భారీ మూల్యం చెల్లించాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలకు పాల్పడినా గులాబీ సైనికులు వీరోచితంగా పోరాడారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు పురపాలక సమరంలో కార్యకర్తలు కనబరిచిన పోరాట స్ఫూర్తి పార్టీకి కొండంత బలం ఇచ్చిందని, ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలిపారు. రెండేళ్ల పాలనలో పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో దౌర్జన్యాలకు దిగారని కేటీఆర్ ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రారంభమైన పరాభవం పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతో అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. అక్రమంగా లూటీ చేసిన ప్రజాధనంతో ప్రజాతీర్పును మార్చాలన్న కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. పోలీసు శాఖను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపులు, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని కేటీఆర్ విమర్శించారు. ప్రజల తీర్పు చివరికి సత్యాన్ని వెలుగులోకి తీసుకువస్తుందని పేర్కొన్నారు.

# అధికార దుర్వినియోగం దుర్మార్గం

- ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడింది
- బీఆర్ఎస్ అభ్యర్థులపై బెదిరింపులు సరికాదు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



సీఎం రేవంత్ రెడ్డి మొదలుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. నామినేషన్ల దాఖలు నుంచి పోలింగ్ వరకు కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడమే కాకుండా, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ఆరోపించారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల వ్యవహారం గర్హనీయమని అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు దిగజారడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని స్పష్టం చేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్‌లకు అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ముగిసిన పుర సమరం!

- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల జాతకం
- కరీంనగర్‌లో దొంగ ఓట్ల కలకలం.. పోలీసుల లాఠీచార్జ్
- జనగామలో డబ్బులివ్వలేదని పోలింగ్ కేంద్రం వద్ద మహిళల ఆందోళన
- రేపు ఫలితాలు.. 16న కొత్త పాలకవర్గాల కొలువు
- లెక్కల్లో మునిగి తేలిన ప్రధాన పార్టీలు
- ఎవరి ధీమాలో వారు..
- అభ్యర్థులను వెంటాడుతున్న క్రాస్ ఓటింగ్ భయం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో గత పది రోజులుగా సాగిన మున్సిపల్ ఎన్నికల ఉత్కంఠకు నేటితో ఒక అంకం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అయితే, 5 గంటల సమయం ముగిసిన తర్వాత కూడా కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా ఓటర్లు బారులు తీరడంతో, లైన్లో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు. దీంతో కొన్ని చోట్ల రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఇప్పుడు అందరి దృష్టి ఫిబ్రవరి 13న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది.



### కరీంనగర్‌లో దొంగ ఓట్ల కలకలం..

పోలింగ్ ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొన్ని డివిజన్లలో దొంగ ఓట్లు వేస్తున్నారనే సమాచారంతో ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు ఢీకొన్నారు. ఒకానొక దశలో పరిస్థితి అదుపు తప్పడంతో, గుంపులుగా ఉన్న కార్యకర్తలను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చినప్పటికీ, అక్కడ గంటల తరబడి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనగామా, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

### జనగామలో డబ్బివ్వలేదని మహిళల ఆందోళన

జనగామ మున్సిపాలిటీలోని 23వ వార్డు పరిధిలో ఒక విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. సరస్వతి స్కూల్ పోలింగ్ స్టేషన్ వద్ద కొంతమంది మహిళా ఓటర్లు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. వారి నిరసనకు కారణం విని అధికారులు సైతం అవాక్కయ్యారు. వార్డులో కొందరికి మాత్రమే ఓటు వేయమని డబ్బులు ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వలేదని వారు బాహాటంగానే నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో డబ్బు పంపిణీ ఏ స్థాయిలో జరుగుతుందో ఈ ఘటన అద్దం పట్టింది. ఈ ఆందోళన సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యి, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### పలుచోట్ల ఆందోళనలు

మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రాజకీయ పార్టీల మధ్య ఘర్షణలు, తోపులాటలు జరగగా, సదాశివపేటలో డబ్బులు పంచుతున్న అభ్యర్థిని పట్టుకోవడం కలకలం రేపింది. నిజామాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే సూర్యనారాయణను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరగగా, బోధన్ మరియు రాకాసిపేట్‌లో దొంగ ఓట్ల యత్నాలను సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకున్నారు. కొన్ని చోట్ల చెలరేగిన ఘర్షణలను పోలీసులు లాఠీఛార్జ్ చేసి అదుపులోకి తీసుకురావడంతో, ప్రస్తుతం పోలింగ్ భారీ భద్రత మధ్య కొనసాగుతోంది.

### ఎవరి ధీమా వారిదే!

పోలింగ్ ముగియగానే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ గెలుపు గుర్రాలపై లెక్కలు వేయడం మొదలుపెట్టాయి. కాంగ్రెస్ అధికార బలం, ఆరు గ్యారెంటీలు తమకు మెజారిటీ మున్సిపాలిటీలను తెచ్చిపెడతాయని హస్తం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ఓటర్లు ఎప్పుడూ తమ వైపే ఉంటారని, తమ సంప్రదాయ ఓటు బ్యాంక్ ఎక్కడికీ పోలేదని గులాబీ శ్రేణులు లెక్కిస్తున్నాయి. పట్టణాల్లో పెరిగిన తమ గ్రాఫ్ ఈసారి క్లీన్ స్వీప్ చేసేలా చేస్తుందని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా క్రాస్ ఓటింగ్ ఎక్కడ జరిగింది? ఏ వార్డులో పరిస్థితి ఎలా ఉంది? ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు రావచ్చు? అనే అంశాలపై అభ్యర్థులు తమ ఏజెంట్లతో చర్చలు జరుపుతూ తలమునకలయ్యారు.

### రేపు తేలనున్న భవితవ్యం..

పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచే ట్రెండ్స్ మొదలై, సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెలువడనున్నాయి. 16వ తేదీన కొత్త పాలక వర్గాలు బాధ్యతలు స్వీకరించనున్నాయి.

## అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం

అభ్యర్థులను క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతోంది. పార్టీ గుర్తులపై జరిగిన ఈ పోరులో కార్యకర్తలు, ఓటర్లు తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేశారా? లేక లోపాయికారీ ఒప్పందాలతో ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా అసమ్మతి నేతలు ఉన్న వార్డుల్లో సొంత పార్టీ క్యాడరే తమకు వ్యతిరేకంగా ఓటు వేయించి ఉంటుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకున్నప్పటికీ కొందరు ఓటర్లు క్రాస్ ఓటింగ్ కు పాల్పడి ఉంటారని, ఇది తమ గెలుపు అవకాశాలను దెబ్బతీస్తుందని ప్రధాన పార్టీల నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

## దుబాయ్ నుంచి వచ్చి ఓటేసిన వేములవాడ వాసి

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి**

ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చాటిచెబుతూ వేములవాడకు చెందిన బాదవేణి రోహిణి విమల అందరికీ ఆదర్శంగా నిలిచారు. మున్సిపల్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఆమె ఏకంగా దుబాయ్ నుంచి వేములవాడకు తరలివచ్చారు. ఎంత దూరంలో ఉన్నా పౌర బాధ్యత ముఖ్యమని భావించి, శ్రమను లెక్కచేయకుండా వచ్చి ఓటు వేసిన ఆమె చొరవను స్థానికులు అభినందించారు.

## యూరియా కోసం రోడ్డెక్కే దుస్థితి: బండి సంజయ్

**వేద న్యూస్, కరీంనగర్**

రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సమస్యలపై ఏమాత్రం శ్రద్ధ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఎన్నికలు, రాజకీయాలపైనే దృష్టి పెట్టి రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, శంకరపట్నంలో యూరియా అందక రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎరువుల సరఫరా విషయంలో ప్రభుత్వం వద్ద స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.గత పంట కాలంలో కూడా యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళనకరమన్నారు.

# రెవెన్యూ యోధుడు.. ఉద్యోగుల ఆశాదీపం!



## వృత్తిలో అధికారి.. ప్రవృత్తిలో సేవకుడు

- ఆపదలో ఉన్న ఉద్యోగికి ఆత్మీయ బంధువు..
- తెలంగాణ రెవెన్యూ జాతి గర్వించదగ్గ నాయకుడు
- వీఆర్ఏల పాలిట 'జాతి పిత'
- సమస్య ఏదైనా.. పరిష్కారం లభిస్తుందనే నమ్మకం
- లచ్చిరెడ్డి సేవా ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం


**'వేద న్యూస్'తో తన భావాలు పంచుకున్న తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు కొమాండ్ల**

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

రెవెన్యూ వ్యవస్థలో కేవలం ఫైళ్లు, సర్వేలు మాత్రమే కాదు, మానవీయ కోణంలో ఆలోచించే మనసు కూడా ఉంటుందని తన కార్యదక్షతతో నిరూపించిన మహోన్నత వ్యక్తి లచ్చిరెడ్డి అని, ఆయన చేసిన సేవలు, సాధించిన విజయాలు నేడు తెలంగాణ రెవెన్యూ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు కొమాండ్ల అభిప్రాయపడ్డారు. 'వేద న్యూస్'తో తన భావాలను ప్రత్యేకంగా పంచుకున్నారు.

### వీఆర్ఏల పాలిట 'జాతి పిత'

ఒక తండ్రి తన బిడ్డల భవిష్యత్తు కోసం ఎలాగైతే తపిస్తాడో, లచ్చిరెడ్డి వేలాది మంది వీఆర్ఏల జీవితాల్లో వెలుగు నింపడానికి అలాగే పోరాడారు. వీఆర్ఏ వ్యవస్థ నుంచి వివిధ శాఖల్లోకి వెళ్లిన ఉద్యోగులకు ఎంప్లాయ్ ఐడీలు ఇప్పించడంలో ఆయన చూపిన చొరవ అసామాన్యమని రాజు కొమాండ్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేవలం గుర్తింపు మాత్రమే కాదు, వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి సకాలంలో జీతాలు వచ్చేలా చూడటం, విజయవంతంగా ప్రొబేషన్ డిక్లేర్ చేయించడం వెనుక లచ్చిరెడ్డి అలుపెరగని కృషి ఉంది. అంతే కాకుండా, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిగా తెలంగాణ ఇంక్రిమెంట్ కూడా ఇప్పించి, రెవెన్యూ ఉద్యోగుల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు. అందుకే నేడు ప్రతి రెవెన్యూ ఉద్యోగి గుండెల్లో ఆయన 'రెవెన్యూ జాతి పిత' గా కొలువవుతున్నారు.




### ఉద్యోగుల జేఏసీ వారధి

డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్‌గా లచ్చిరెడ్డి కేవలం ఒక హోదాకు మాత్రమే పరిమితం కాలేదు. టీజీటీఏ, డీసీఏ, టీజీఆర్ఎస్ఏ, జీపీఏ వంటి అన్ని సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చి, ఉద్యోగుల హక్కుల కోసం సింహంలా గర్జించారు. పని ఒత్తిడిలో నలిగిపోయే రెవెన్యూ యంత్రాంగానికి ఆయన ఒక భరోసా.

### సపోర్ట్ సర్వీస్ ట్రస్ట్.. ఒక అక్షర సత్యం

నెల్సన్ మండేలా ఆశయాలు, మదర్ థెరిసా కరుణను పుణికిపుచ్చుకున్న లచ్చిరెడ్డి.. ల్యాండ్ రెవెన్యూ ఎంప్లాయిస్ సపోర్ట్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా వృత్తి ధర్మాన్ని సామాజిక ధర్మంతో ముడిపెట్టారు. తోటి ఉద్యోగి ఆపదలో ఉంటే నేనున్నానంటూ ముందుంటారు. వెన్నెముక లాంటి రైతుకు కష్టం వస్తే స్పందించడం.. ఆత్మసంతృప్తే అసలైన సంపద అని నమ్మి స్వార్థం లేని సేవ చేసే మనిషని కొనియాడారు.

### అలుపెరగని ప్రయాణం

లచ్చిరెడ్డి కేవలం ఒక సంఘం నేత కాదు, ఒక వ్యవస్థ. ఉద్యోగుల సమస్య ఏదైనా, ఆయన దగ్గరకు వెళ్తే పరిష్కారం లభిస్తుందనే నమ్మకం.. ఖాకీ, తెల్ల చొక్కాల వెనుక ఉండే రెవెన్యూ హృదయాల ఆర్ద్రతకు లచ్చిరెడ్డి నిలువెత్తు నిదర్శనం. రెవెన్యూ యోధులు సాగిస్తున్న ఈ సరికొత్త ప్రయాణానికి లచ్చిరెడ్డి ఒక దిక్సూచి వంటి వారని రాజు కొమాండ్ల తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

**రాజు కొమాండ్ల**
జూనియర్ అసిస్టెంట్
తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫోన్: 9848432402



వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 12, 2026

# భక్తులకు సాఫీగా దర్శనం కల్పించాలి

- వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో సాఫీగా దర్శనం కల్పించాలని వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న భీమేశ్వర స్వామి ఆలయంలో జరుగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూలైన్లు, భక్తుల ప్రవేశనిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. జాతర రోజుల్లో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిశీలనలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, ఈఈ రాజేష్, ఆర్అండ్బీ డీఈ శాంతయ్య, డీఈ మైపాల్ రెడ్డి, ఆలయ ఇన్చార్జ్ చానా స్థానాచార్యులు, నమిలికొండ ఉమేష్ శర్మ, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- వేములవాడ ఆర్డీవో రాధాబాయి




**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా, భయరహితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వేములవాడ ఆర్డీవో రాధాబాయి కోరారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లో మొత్తం 58 పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల లోపు ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు

# యూరియా దొరక్క రైతుల అవస్థలు



- పొలంపల్లి మాజీ సర్పంచ్ ధారావత్ భద్ర నాయక్

**వేద న్యూస్, కారేపల్లి:**

దేశానికి వెన్నెముక రైతు అని చెప్పే పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని పొలంపల్లి మాజీ సర్పంచ్ ధారావత్ భద్ర నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పొలం వేసి రెండు నెలలు గడిచినా యూరియా అందక వరి పంట ఎదగడం లేదని, పంట చేతికి వస్తుందో లేదో అన్న ఆందోళన రైతుల్లో నెలకొందని తెలిపారు. యూరియా నిల్వలు వస్తున్నాయని చెబుతున్నప్పటికీ సామాన్య రైతులకు అందడం లేదని, కొందరికి మాత్రమే పంపిణీ జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా, రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. "రైతు బతకాలంటే వరి పండాలి.. వరి పండాలంటే యూరియా అవసరం. యూరియా కోసం అధికారుల చుట్టూ తిరగాలా? లేక వ్యవసాయం మానేయాలా?" అని ప్రశ్నించారు. గ్రామాల్లో యూరియా లభ్యతపై అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి, అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి అధికారులు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'గ్లోబల్' సందడి

- అమ్మ గెలుపు కోసం లండన్ నుంచి వచ్చి ఓటేసిన కూతురు

**వేద న్యూస్ , జమ్మికుంట:**



తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండవ సాధారణ మున్సి పల్ ఎన్నికల్లో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మున్సిపా లిటీ పరిధిలోని, 20వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన కొక్కుల శ్రీలత కేదారీశ్వర్ గెలుపు కోసం ఆమె ఏకైక కుమార్తె లండన్ నుంచి తరలివచ్చారు. సుంకేనపల్లి మాధురి (కొక్కుల మాధురి) లండన్లో స్థిరపడినప్పటికీ, తన తల్లికి మద్దతుగా నిలిచేందుకు మరియు తన ఓటు హక్కును వినియోగిం చుకోవడానికి ఏకంగా ఖండాంతరాలు దాటి స్వగ్రామాని కి చేరుకున్నారు. కేవలం తాను రావడమే కాకుండా, తన ఎనిమిది నెలల పసికందు నిత్యశ్రీ ని సైతం వెంటబెట్టుకు ని రావడం అక్కడి ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. తన తల్లిపై ఉన్న ప్రేమాభిమానాలతో పాటు, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పేలా మాధురి తీసుకున్న ఈ నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశమైంది. మాతృమూర్తికి అండగా నిలుస్తూ ఆమె చేసిన ప్రచారం వార్డులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# మానవత్వం చాటుకున్న సర్పంచులు





**వేద న్యూస్, కారేపల్లి:**

- సోనా కుటుంబానికి భరోసా

మండల కేంద్రంలోని మేకలతండా గ్రామానికి చెందిన భూక్యా సోనా అకాల మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. విషయం తెలిసిన వెంటనే ప్రజా ప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం మృతుని గృహాన్ని సందర్శించిన దుబ్బతండా సర్పంచ్ ఆంగోత్ మత్రు, గంగారం తండా సర్పంచ్ నూనావత్ కిరణ్ సోనా మృతికి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ తామున్నామనే మనోధైర్యాన్ని కల్పించారు. సామాజిక బాధ్యతగా సర్పంచ్ ఆంగోత్ మత్రు రూ.5వేలు, నూనావత్ కిరణ్ రూ.2వేలు నగదును ఆర్థిక సహాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా లచ్చిరామ్, విజయ్, గూగులోత్ కుమార్, చిట్టిబాబు, లావుడ్య నరేష్, జాటోత్ కిషన్ తదితరులు పాల్గొని సోనా ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. "పదవుల కంటే ప్రజల కష్టాలే ముఖ్యం" అని చాటిచెప్పిన సర్పంచుల చొరవను మేకలతండా గ్రామస్తులు కొనియాడారు.

# హింగే భాస్కర్ కు పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ,హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు పలువురు తెలిపారు. ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, మండలంలో రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న రైతు సంక్షేమం సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ రైతు సమాజానికి ఎంతో మేలు రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా మీరు సామర్థవంతంగా రైతుల వెన్నంటే ఉండి రైతులకు సామన్యాయంగా మేలు జరిగే విధంగా పోరాడి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తున్న హింగే భాస్కర్ జన్మదిన శుభాకాంక్షలు మీరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో కుటుంబ సభ్యులతో మరెన్నో ఇలాంటి పుట్టినరోజు శుభాకాంక్షలు జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సుకినే సంతాజి, ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కందుకూరి రాజన్న, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు శ్రీరామోజు సతీష్ చారి, చిర్ర ఉదయ చందర్, ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శి నల్ల రాజిరెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు బొంకూరి వంశీ, ప్రెస్ క్లబ్ కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కోశాధికారి కందుకూరి మహేష్ చారి, మిత్రుడు అల్లకొండ రాజు, కానిస్టేబుల్ బక్కయ్య, సీనియర్ కాంగ్రెస్ నేత బొల్లె పోగు డాక్టర్ రమేష్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాక రమేష్, బొంకురి కార్తీక్, ఆర్టీసీ డ్రైవర్ గుడెల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రాత్రిపూట జోరుగా ఇసుక దందా

- సాలూరు మండలంలో మాఫియా అరాచకం



**వేద న్యూస్, నిజామాబాద్:**

నిజామాబాద్ జిల్లా సాలూరు మండలం మందర్న-మంజీరా సరిహద్దు ప్రాంతం నుంచి కొంతమంది ఇసుక మాఫియా దారులు ప్రతిరోజు రాత్రిపూట భారీగా ఇసుకను తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోతంగల్ మండలం సుంకిని గ్రామం మంజీరా సరిహద్దు ప్రాంతంతో పాటు కొడిచెర్ల పరిసర ప్రాంతాల నుంచి కూడా ప్రతిరోజు రాత్రిపూట, అలాగే ఇతర సమయాల్లో ఇసుక భారీగా తరలిపోతుందని పేర్కొంటున్నారు. మంజీరా సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి అయ్యిందంటే చాలు ట్రాక్టర్లు, వాహనాల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయంపై పట్టించుకునే అధికారులు లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



- సిరిసిల్ల జిల్లా ఎస్పీ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి భద్రతాపరమైన పలు సూచనలు చేస్తూ, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

# వికలాంగులకు పోలీసుల చేయూత



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వేములవాడలో వికలాంగులు, వృద్ధ ఓటర్లకు పోలీసులు సహాయం అందిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వికలాంగులు, వృద్ధులకు సిబ్బంది చేయూతనిస్తున్నారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడం, బయటకు రావడం వంటి విషయాల్లో సహకరిస్తూ, నడవడానికి ఇబ్బంది పడుతున్న వారిని వెంట తీసుకెళ్లి ఓటు వేసే వరకు సహాయం చేస్తున్నారు. దీంతో వికలాంగులు, వృద్ధులు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

# చారిత్రాత్మక నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా

## – ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్



**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ మహానగరాన్ని మూడు విభాగాలుగా పునర్విభజించాలనే ప్రభుత్వ నిర్ణయం నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందని తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోటి 20 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారని, ఇంతటి భారీ జనాభా కలిగిన నగరాన్ని ఒకే కేంద్రం నుండి పాలించడం వల్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆయన విశ్లేషించారు. తాను స్వయంగా ఎక్స్ అఫీషియల్ మెంబర్‌గా ఉన్న అనుభవంతో చెబుతున్నానని, కౌన్సిల్ సమావేశాల్లో కార్పొరేటర్లకు గానీ, సభ్యులకు గానీ ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి తగిన సమయం దొరకడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విభజన ద్వారా అధికార వికేంద్రీకరణ జరిగి, ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం వల్ల ప్రాంతీయ కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా సామాన్య ప్రజలు తమ సమస్యల కోసం సుదూర ప్రాంతాల నుండి ప్రధాన కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదని వివరించారు. ఈ నిర్ణయం వల్ల కౌన్సిల్ సమావేశాలు సమర్థవంతంగా జరుగుతాయని, స్థానిక సమస్యలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని ఆయన అన్నారు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం ఒక గొప్ప ఊతం ఇస్తుందని, అందుకే ముఖ్యమంత్రి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తామంతా మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. విపక్షాల విమర్శలపై స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు కేవలం రాజకీయ ఉద్దేశాలతోనే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని అద్దంకి మండిపడ్డారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నగరాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవాలని చూసిందే తప్ప, ప్రజా సౌకర్యాల గురించి ఆలోచించలేదని ఆరోపించారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అధికారులకు అందుబాటులో ఉండేవారు కాదని, ఫలితంగా ఎన్నో సమస్యలు ప్రజలను వేధించాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల మరియు ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్తున్నారని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి వ్యక్తిగత ఎజెండా లేదని, కేవలం పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ అడుగు వేసినట్లు వివరించారు. భవిష్యత్తులో హైదరాబాద్ భారతదేశంలోనే అతిపెద్ద నగరంగా ఆవిర్భవించబోతోందని అద్దంకి దయాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు నగరం విస్తరించిన నేపథ్యంలో, హైదరాబాద్‌కు "భారతదేశపు ఫ్యూచర్ సిటీ"గా ఉండే అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పథంలో భాగస్వామ్యం కావాల్సిన విపక్షాలు, అనవసరమైన రాద్ధాంతం మానుకోవాలని ఆయన హితవు పలికారు. నగరాభివృద్ధి కోసం తీసుకున్న ఈ పర్ఫెక్ట్ నిర్ణయానికి ప్రజలందరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు.

# గాదెపాడులో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదం

## – ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రేగమండల దిగ్బంధం



**వేద న్యూస్, సింగరేణి:**

సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ భారీగా పెరిగిన చెత్తాచెదారం, ఎండిన రేగమండలు (ముళ్ల పొదలు) స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తూ శుభ్రత నిర్వహించాలి. అయితే గాదెపాడులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎండిన పొదలు అలుముకోవడంతో ఎప్పుడైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. చెత్తాచెదారం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొనడంతో అటుగా వెళ్లే చిన్నారులు, పశువులకు ప్రాణాపాయం ఉన్నట్లు వారు పేర్కొన్నారు. పలుమార్లు అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పందన లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాన్ని శుభ్రపరిచి, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ



**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చికోడు గ్రామంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఐదో వార్డ్ సభ్యుడు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 22 గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, గ్రామంలో రేషన్ కార్డు కలిగి గ్యాస్ సిలిండర్ లేని అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చికోడు గ్రామ సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు గ్రామ ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, స్థానిక నాయకులు, వార్డ్ సభ్యులు, గ్యాస్ లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్

## – ఓటింగ్ సరళిపై సమీక్ష

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, గీతానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, ఓటింగ్ సరళిని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వేములవాడ సినారే కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. గాంధీనగర్‌లోని గ్రీన్ పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు వేసిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



**వేద న్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ పట్టణంలోని 41వ వార్డు 123వ పోలింగ్ కేంద్రంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు నిశ్చింతగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## – మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**వేద న్యూస్, దామరచర్ల:**

భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మిర్యాలగూడ పట్టణ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడలోని బాపూజీనగర్ వడ్డెర సంఘం భవనంలో నల్లమోతు భాస్కర్ రావు, ఆయన సతీమణి నల్లమోతు జయ, తనయుడు సిద్ధార్థ్, కోడలు రాణి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి నిరాటంకంగా కొనసాగాలంటే ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా ఓటు వేయాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు ఓటు అనే వజ్రాయుధమే సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు
- పోలింగ్ కేంద్రాల పరిశీలన



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దబజార్, పిట్లం బేస్, నవాబ్‌పేట్, గర్ల్స్ హై స్కూల్, గోల్కొండ వీధి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, స్ట్రైకింగ్ ఫోర్స్ మోహరింపు, క్యూలైన్ నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలను పారదర్శకంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్లు భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముదస్సిర్‌కు సోషల్ ఫోరం సన్మానం



**వేద న్యూస్, వరంగల్:**

తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లాకు తృతీయ స్థానం సాధించేందుకు కృషి చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కృష్ణ కాలనీకి చెందిన పదవ తరగతి విద్యార్థి మహమ్మద్ ముదస్సిర్‌ను సోషల్ ఫోరం (ఉర్సు సోషల్ కాంప్లెక్స్) ఘనంగా సన్మానించింది. బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముదస్సిర్‌కు శాలువాతో పాటు బహుమతి అందజేశారు. అలాగే విద్యార్థి ప్రతిభ వికాసానికి మార్గదర్శకులైన సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌లు ముతోజు సదాలక్ష్మి, కే. రాజేష్‌లను పూలదండలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ముదస్సిర్ మాట్లాడుతూ, తనలోని ప్రతిభను వెలికితీసేలా శిక్షణ ఇచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాల విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సోషల్ ఫోరం గౌరవాధ్యక్షులు భూపాల్ రెడ్డి, అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం. బిక్షపతి, కోశాధికారి రంగాచారి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ముదస్సిర్ విద్యాభ్యాసానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో ధన ప్రవాహం ఎక్కువవుతోంది

- ఒక్కో ఓటుకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పంచారు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు



**వేద న్యూస్, కరీంనగర్:**

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు చూస్తే సామాన్యుడు రాజకీయాల్లోకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొన్నదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ 52వ డివిజన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ. .ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం ప్రతి పౌరుడి పవిత్ర బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రస్తుత ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం బహిరంగంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఒక్కో ఓటుకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు డబ్బు పంపిణీ జరుగుతోందన్న సమాచారం తనకు అందిందన్నారు. ఒకే డివిజన్‌లో అభ్యర్థి రూ.3 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాడన్న వార్తలు వినిపిస్తున్నాయని తెలిపారు. స్థానిక సంస్థల్లో పదవి అంటే సేవ చేయడం అని, అలాంటిది ఇంత భారీగా ఖర్చు చేయడం ప్రజాస్వామ్యానికి శుభ సూచకం కాదని పేర్కొన్నారు. తన 27 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితిని చూడలేదని అన్నారు. డబ్బుతో గెలిచినా అభివృద్ధి చేయాలన్న సంకల్పం లేకపోతే ప్రజలకు ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఈసారి హంగ్ పరిస్థితి ఏర్పడే అవకాశముందని అంచనా వేశారు. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చే అవకాశం తక్కువగా ఉందని, స్వతంత్ర అభ్యర్థులు కీలక పాత్ర పోషించే పరిస్థితి ఉందన్నారు. ఎవరైనా మేయర్‌గా ఎన్నికైనా నగరాభివృద్ధినే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల వేళ గంగుల చేసిన ఈ వ్యాఖ్యలు కరీంనగర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# చికెన్ టోకెన్ల కోసం క్యూ కట్టిన ఓటర్లు



**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను రకరకాల ప్రలోభాలకు గురిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా కొందరు అభ్యర్థులు ఓటర్లకు చికెన్ టోకెన్లు పంపిణీ చేసినట్లు సమాచారం. పట్టణంలోని పలు వార్డుల్లో ఓటర్లకు కేజీ చొప్పున చికెన్ టోకెన్లు అందజేశారు. మంగళవారం రోజు మొత్తం టోకెన్ల పంపిణీ కొనసాగింది. టోకెన్లు పొందిన ఓటర్లు చికెన్ కోసం వివిధ చికెన్ సెంటర్ల వద్దకు వెళ్లి బారులు తీరారు. బుధవారం పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాల్సిన ఓటర్లు కూడా టోకెన్లు పట్టుకొని చికెన్ సెంటర్ల వద్ద క్యూలో నిలబడటం గమనార్హం. దీంతో పట్టణంలోని పలు చికెన్ సెంటర్ల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. రద్దీ పెరగడంతో షాపుదారులు షట్టర్లు వేసి కిటికీల ద్వారా టోకెన్లు స్వీకరించి చికెన్ పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.

# రాషోమాన్ ఎఫెక్ట్..

- నేటి వైద్య వ్యవస్థలో మనం గుర్తించాల్సిన నిజం
- ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉడుగుల సురేష్ వెల్లడి




**వేద న్యూస్, జమ్మికుంట:**

నేటి రోజుల్లో ఆరోగ్య సమస్య వస్తే మనలో చాలామంది చేసే మొదటి పని.. గూగుల్‌లో లక్షణాలు వెతకడం, నేరుగా సూపర్ స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్లడం చేస్తున్నారు. ఇది ఎంతవరకు సురక్షితం? అనేది ప్రశ్నించుకోవాలి. అసలు సమస్య ఇక్కడే మొదలవుతుందనీ, దానినే "రాషోమాన్ ఎఫెక్ట్" అంటారనీ గోల్డ్ మెడలిస్ట్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, ఎండీ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉడుగుల సురేష్ వివరించారు. ఆయన మాటల్లోనే.. పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**రాషోమాన్ ఎఫెక్ట్ అంటే ఏమిటి?**

రాషోమాన్ అనేది ప్రసిద్ధ జపనీస్ సినిమా. ఒకే సంఘటనను వేర్వేరు వ్యక్తులు..తమ తమ దృష్టికోణంలో వేర్వేరు విధాలుగా వివరిస్తారు. అందరూ నిజమే చెబుతున్నామని నమ్ముతారు. ఎందుకంటే అది వారి కోణంలో నిజమే.అదే విధంగా, వైద్య రంగంలో కూడా ప్రతి సూపర్ స్పెషలిస్ట్ రో గాన్ని తన స్పెషలైజేషన్ కళ్లజోడుతోనే చూస్తాడు. నేటి వైద్య వ్యవస్థలో ఇది ప్రమాదం. అతి సూపర్ స్పెషలైజేషన్, రోగిని సంపూర్ణ వ్యక్తిగా చూడకపోవడం,అవసరానికి మించి పరీక్షలు, గందరగోళమైన చికిత్సలు, రోగి భయం, ఖర్చు, ఒత్తిడి పెరగడం..ఇదే నేటి మౌన సమస్య. దీనికి పరిష్కారం ముందు ఒక మంచి జనరల్ ఫిజిషియన్‌ను సంప్రదించాలి. జనరల్ ఫిజిషియన్ మాత్రమే..రోగిని మొత్తం వ్యక్తిగా చూస్తాడు.అన్ని లక్షణాలను కలిపి విశ్లేషిస్తాడు.అవసరమైతే సరైన స్పెషలిస్ట్‌కు పంపిస్తాడు. ఇదే సరైన, సురక్షితమైన వైద్య మార్గం. గూగుల్ డాక్టర్‌ను నమ్మొద్దు, నేరుగా సూపర్ స్పెషలిస్టుల వద్దకు పరుగెత్తొద్దు, మొదటి అడుగు ఎప్పుడూ జనరల్ ఫిజిషియన్ దగ్గరే, సరైన డాక్టర్‌ను సరైన సమయంలో కలవడం కూడా ఒక చికిత్సే అని డాక్టర్ ఉడుగుల సురేష్ వివరించారు.

# చిన్నారిని చితకబాదిన అంగన్వాడీ టీచర్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారిపై టీచర్ దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొంపెల్లి విజయ్ కుమారుడు విధ్వంస్ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్నాడు. ఆ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ సల్వాని రాణి చిన్నారిని చితకబాదడంతో కన్నుకు గాయం అయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన పై ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లి దండ్రులు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిని అకారణంగా తీవ్రంగా కొట్టిన టీచర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వేములవాడలో 77.80 శాతం నమోదు

- అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు అందిన గణాంకాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 77.80 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో మొత్తం 31,803 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 14,742 మంది పురుషులు, 17,055 మంది మహిళలు, ఆరుగురు ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు వేయడం విశేషం. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడంతో ఎన్నికల సందడి నెలకొంది. అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసిన ఈ ఎన్నికలతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.

# యూరియా తంటా.. రైతుల మంట..

- రోడ్డెక్కి ధర్నాకు దిగిన అన్నదాతలు



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో బుధవారం యూరియా కోసం రైతులు రోడ్డుపై ధర్నాకు దిగారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఎరువు కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం యూరియా కోసం మరింత శ్రమించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. తాజాగా ప్రవేశపెట్టిన యూరియా యాప్ రైతులకు మరింత ఇబ్బందిగా మారిందని వారు విమర్శించారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలంటే స్మార్ట్‌ఫోన్, టెక్నాలజీ పరిజ్ఞానం తప్పనిసరి కావడం గ్రామీణ రైతులకు కష్టసాధ్యమవుతోందని పేర్కొన్నారు. యూరియా స్టాక్ అందుబాటులోకి వచ్చిన వెంటనే బుక్ చేసుకున్నా కాసేపటికే 'స్టాక్ అవుట్' అవుతోందని, దీంతో రైతులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించి రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# బాల్య దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

- ప్రధానోపాధ్యాయులు ఎన్. రజిత



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 'విజ్ఞాన శాస్త్రంలో బాలికల అంతర్జాతీయ దినోత్సవం'ను ప్రధానోపాధ్యాయులు ఎన్. రజిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. సైన్స్ రంగంలో ప్రతిభ కనబరిచిన మహిళల వేషధారణ ద్వారా వారి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. భారత సంతతి మహిళా వ్యోమగాములు కల్పనా చావ్లా, సునీత విలియమ్స్‌తో పాటు మహిళా డాక్టర్లు, ఇంజనీర్ల విజయాలను ప్రస్తావించారు. సమాజ అభివృద్ధిలో విజ్ఞాన శాస్త్రం కీలకమని, దేశ ప్రగతి శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. బాలికలు బాలురతో సమానంగా ఇంజనీరింగ్, వైద్యశాస్త్రం, అంతరిక్ష పరిశోధన, సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. బాల్య దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, తిరుమల తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి చేయూత



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రానికి చెందిన బాసని సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయనతో కలిసి 1982-83 సంవత్సరాల్లో పదో తరగతి చదివిన చిన్ననాటి స్నేహితులు బుధవారం సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వలుపదాసి రమేష్, వినుకొండ శంకరాచారి, దుబాసి రవీందర్, శ్రీరామోజు జయప్రకాశ్, పసునూటి ప్రకాశ్, బూర ఈశ్వరయ్య, రేణిగుంట్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సునీల్ కు ఉత్తమ ఫీల్డ్ ఫెసిలిటేటర్ అవార్డు



**వేద న్యూస్,శాయంపేట:** ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, వరంగల్ శాయంపేట క్లస్టర్‌లో ఫీల్డ్ ఫెసిలిటేటర్‌గా పనిచేస్తున్న పోతు సునీల్ ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ఫీల్డ్ ఫెసిలిటేటర్ అవార్డును అందుకున్నారు. మహిళా సాధికారత దిశగా ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు. శాయంపేట ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు రావడంతో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ అధికారులు, బెటర్ కాటన్ ఇనిషియేటివ్‌కు చెందిన 13 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 12, 2026

# ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలి



- అమ్మాయిల జననాల తగ్గుదలపై అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నేరేడుపల్లి, ప్రగతి సింగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు మరియు శాయంపేట పీహెచ్సీని డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య తనిఖీ చేశారు. మాతా, శిశు సంక్షేమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణుల నమోదు, టీకాల పంపిణీ, అబార్షన్ల వివరాలను సమీక్షించారు. పన్నెండు వారాల లోపు జరిగిన గర్భస్రావాలపై ప్రత్యేకంగా విశ్లేషణ చేపట్టాలని సూచించారు. అమ్మాయిల జననాల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో లింగ వివక్షతపై దంపతులకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రగతి సింగారం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పోషకాహార పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం శాయంపేట పీహెచ్సీలో మందులు, వ్యాక్సిన్ నిల్వలు మరియు ప్రసవాల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్బీఎస్కే బృందాలు, వైద్యాధికారులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షలు రిజిస్టర్లలో నమోదు చేయకపోవడాన్ని గమనించి, తక్షణం సరిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హెల్త్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఎలకుర్తి గ్రామసభలో కీలక తీర్మానాలు



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎలకుర్తి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలపై పలు కీలక తీర్మానాలు ఆమోదించబడ్డాయి. మురికి కాలువల శుభ్రత, ఓవర్‌హెడ్ ట్యాంకులకు మూతలు ఏర్పాటు, ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ అనుమతి తప్పనిసరి చేయడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. అవసరమైన చోట కరెంట్ స్తంభాల మంజూరు, రోడ్ల సరిహద్దులు దాటి నిర్మించిన ఇండ్లపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. అలాగే ఆరోగ్య సబ్‌సెంటర్, అంగన్వాడీ, ఐకేపీ భవనాల నిర్మాణం, ఏటిగడ్డకు మట్టి రోడ్డు, కట్టల మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో సర్పంచ్ దేవప్రసాద్, ఉపసర్పంచ్ వాణి నవీన్, సెక్రటరీ సత్యనారాయణ, వార్డు సభ్యులు గౌండ్ల జ్యోతి యాదవ్ గౌడ్, ఎర్రోళ్ల దుర్గయ్య, ఎం. ప్రభాకర్, కుర్తి రాజు రెడ్డి, షాదుల్, కుర్తి మహేష్ రెడ్డి, వేముల అనిత, ప్రమీల, మౌనికతో పాటు అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోటిలింగాల జాతరకు ఏర్పాట్లు

- పరిశీలించిన ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్

**వేద న్యూస్, కారేపల్లి:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలోని శ్రీ కోటిలింగాల జాతర సందర్భంగా అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, పోలంపల్లి సర్పంచ్ హేమలత ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుద్ధ్య చర్యలు, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. అదనంగా వైద్య శిబిరం, అంబులెన్స్ సదుపాయం, అత్యవసర సహాయ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛంద సేవకులను నియమించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శుభ్రత బృందాలను ఏర్పాటు చేశారు. భక్తులు క్రమశిక్షణ పాటించి అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో



కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి నెహ్రూ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

**వేద న్యూస్, మంచిర్యాల:**



రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆయన తన వ్యక్తిగత సిబ్బంది సహాయంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా ఓటు వేసి సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు

# విద్యార్థులే ఉపాధ్యాయులుగా..




- స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా భావం పెంపొందుతాయని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వై. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కృషి, పట్టుదల, పాఠ్యాంశాలపై పట్టు సాధించే విధానాన్ని విద్యార్థులు ఈ అనుభవం ద్వారా తెలుసుకుంటారని అన్నారు. భవిష్యత్తులో ఏ రంగంలో రాణించాలన్నా పునాది బలంగా ఉండాలని, పాఠ్యాంశాలపై స్పష్టమైన అవగాహన అవసరమని సూచించారు. స్వయం పరిపాలన దినోత్సవంలో పదో తరగతి విద్యార్థిని సహస్ర జిల్లా విద్యాశాఖ అధికారిగా, నాగవైష్ణవి ప్రధానోపాధ్యాయులుగా, హేమచందు మండల విద్యాశాఖ అధికారిగా వ్యవహరించారు. వివిధ సబ్జెక్టులలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించి ప్రతిభ కనబరిచారు. మెరుగైన ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. గణపతి, విజయప్రభ, అనిత కుమారి, డాక్టర్ వంగల జగన్, వసుంధర దేవి, స్వరూప రాణి, ఏ. రాజేంద్రప్రసాద్, వంగేటి లక్ష్మీనారాయణ, సి.ఆర్.పి జి. నరేష్, శ్రీనివాస్, సురేందర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేశాయిపల్లి వరద కాలువ బ్రిడ్జిపై విరిగిన సపోర్ట్ వాల్

- రోజులు గడిచినా స్పందించని అధికారులు
- ప్రమాదం భయంతో ప్రయాణికులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మం డలం దేశాయిపల్లి గ్రామ సమీపంలోని వరద కాలువపై ఉన్న బ్రిడ్జి సపోర్ట్ వాల్ మధ్యభాగం విరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘట నకు రోజులు గడిచినా సంబంధిత అధి కారులు ఇప్పటివరకు మరమ్మతులపై చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరో పిస్తున్నారు. ఈ బ్రిడ్జిపై ప్రతిరోజూ వాహ నాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా స్కూల్, కాలేజీ బస్సులు, గ్రానైట్ లారీలు సహా వందలాది వాహనాలు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నందున ప్రమాదం జరిగితే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దుర్ఘటనలు జరిగే ముందే అధికారులు స్పందించి బ్రిడ్జి సపోర్ట్ వాల్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ అనిత - ఆరోగ్య కేంద్రం తనిఖీ

**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి మండల పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాతావరణ మార్పులతో వివిధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అసంక్రమణ వ్యాధులను ముందుగానే గుర్తించి మందులు అందించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే 100 శాతం గర్భిణీలను నమోదు చేసి టీకాలు ఇవ్వాలని, క్షయవ్యాధి నియంత్రణ




లో భాగంగా కేసులను ముందుగా గుర్తించి మొబైల్ ఎక్స్‌రే సదుపాయాన్ని మారుమూల ప్రాంతాల్లో అమలు చేయాలని ఆదేశించారు. రోగులతో సమన్వయం కలిగి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత ముఖ్యమని తెలిపారు.

# సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్ స్కిల్స్‌పై 3 వారాల శిక్షణ ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన కేయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 62 మంది యువ విద్యార్థినులను సురక్షితమైన, విజయవంతమైన భవిష్యత్తుకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్ స్కిల్స్‌పై మూడు వారాల శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. రమణ, కాకతీయ విశ్వవిద్యాలయ అదనపు కంట్రోలర్ డా. ఎండీ ఆసిమ్ ఇక్బాల్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా ఐసెట్ అకాడమీ సీనియర్ మేనేజర్ షేక్ పాషా, ట్రైనర్ బోధిసత్వ కుందు పాల్గొన్నారు. వారు నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎం. రేఖశ్రీ, డి. భాగ్యలక్ష్మి, డా. పి. సంతోష్ కుమార్ (ఈసీఈ), టీపీఓ, ఎస్‌పీఓసీ సమన్వయం చేస్తున్నారు. ఈ శిక్షణలో సైబర్ సెక్యూరిటీపై సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, టీమ్ వర్క్, లీడర్‌షిప్ వంటి సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. విద్యార్థినుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, ఉద్యోగ అవకాశాల పట్ల సిద్ధత పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. మహిళా సాధికారతకు సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# కేయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య నరసింహాచారి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కేయూ కామర్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా, విభాగాధిపతిగా ఆచార్య ఎస్. నరసింహాచారిని రెండేళ్ల కాలానికి నియమిస్తూ కేయూ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమరవేణి పదవీకాలం పూర్తికావడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఆచార్య నరసింహాచారి గతంలో పరీక్షల నియంత్రణాధికారి, అడ్మిషన్ల డైరెక్టర్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్, టీజీ ఐసెట్ కన్వీనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన విశ్వవిద్యాలయ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన నియామకంపై పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య పి. వరలక్ష్మి, ఆచార్య పి. అమరవేణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ ఫణీంద్ర, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

**– సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో మొత్తం పోలింగ్ 77.70 శాతం**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 77.70 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో మొత్తం 81,959 మంది ఓటర్లలో 63,562 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 30,466 మంది పురుషులు, 33,091 మంది మహిళలు, 5 మంది ఇతరులు ఉన్నారు. సిరిసిల్లలో 77.55 శాతం పోలింగ్ నమోదైంది. వేములవాడ మున్సిపాలిటీలో మొత్తం 40,877 మంది ఓటర్లలో 31,881 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 14,801 మంది పురుషులు, 17,070 మంది మహిళలు, 10 మంది ఇతరులు ఉన్నారు. వేములవాడలో 77.99 శాతం పోలింగ్ నమోదైంది. రెండు మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 1,22,836 మంది ఓటర్లలో 95,443 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం పోలింగ్ శాతం 77.70గా నమోదు అయింది.

# ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్ల నరికివేత

## 'వేద న్యూస్' ఎఫెక్ట్





వేద న్యూస్

2026-02-03

https://epaper.vedhanews.in/

ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్లు మాయం!

**వేద న్యూస్, కారేపల్లి:**

మండల పరిధిలోని గేట్ కారేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్ల నరికివేత ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై 'టేకు చెట్టు మాయం' శీర్షికతో 'వేద న్యూస్'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారులు ఆరు రోజుల పాటు విచారణ చేపట్టారు. కారేపల్లి ఎఫ్ఆర్ఓ ఎప్పప్రదైటీస్ వెల్లడించిన వివరాల ప్రకారం, పాఠశాల ప్రాంగణంలో అనుమతులు లేకుండా అక్రమంగా మూడు టేకు చెట్లు నరికి వేయడంతో పాఠశాల హెచ్ఎం వెంకటరమణపై చర్యలు తీసుకున్నారు. బుధవారం రూ.22,714 జరిమానాను అటవీ శాఖకు చెల్లించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టేకు కలపను ఇల్లందు డిపోకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే అటవీ శాఖ చర్యలు తీసుకున్నప్పటికీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# వేములవాడలో ఎన్నికల సిబ్బంది నిరసన

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రెమ్యునరేషన్ తక్కువగా చెల్లించారని ఆరోపిస్తూ వేములవాడలో ఎన్నికల సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్సులు అప్పగించిన సిబ్బంది, ఇతర ప్రాంతాల్లో రూ.1300 పారితోషకం ఇస్తుండగా ఇక్కడ మాత్రం రూ.800 మాత్రమే ఇవ్వడం సరైందా అని ఆర్డీవో రాధాబాయి, జిల్లా ఎన్నికల సహాయ అధికారి సంపత్ కుమార్‌ను ప్రశ్నించారు. అలాగే భోజన ప్యాకెట్లను చెత్త బండిలో సరఫరా చేయడంతో దుర్వాసన వచ్చిందని, ఇది తమకు అవమానకరంగా అనిపించిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

# సిటీ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**వేద న్యూస్, హైదరాబాద్:**




ప్రభుత్వ సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రఖ్యాత ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో సేవలందించిన సీనియర్ నేత్ర వైద్యుడు డా. చంద్రశేఖర్ నేతృత్వంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, బోధకులు, బోధనేతర సిబ్బంది శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు. శిబిరాన్ని వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ దత్ శుక్ల ప్రారంభించారు. కళ్ల సంరక్షణకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమాన్ని డా. బి. కృష్ణచంద్ర కీర్తి, డా. వి. శ్రీదేవి, డా. ఎల్. తిరుపతి, డా. బి. సుదక్షణ, డా. రవీంద్రబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమన్వయం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కళాశాల యాజమాన్యం డా. చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపి

# ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**వేద న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలో నిర్వహించిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీలలో పోలింగ్ సజావుగా నిర్వహించబడిందన్నారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్, అనంతరం బెల్లంపల్లి, క్యాతనపల్లి ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అర్హత గల ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని, సాయంత్రం 5 గంటలలోపు గేటు మూసివేసి, లోపల ఉన్నవారికి ఓటు వేయడానికి అవకాశం కల్పించాలని సూచించారు. సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో అవసరమైన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలో తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓలు, ఎ.పి.ఓలు తదితర సిబ్బందికి శిక్షణ ఇచ్చి, భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సిటీ కాలేజీలో విజయవంతమైన ప్లేస్‌మెంట్ డ్రైవ్




**వేద న్యూస్, హైదరాబాద్:**

**– 216 మందికి ఉద్యోగాలు– 55 మంది సిటీ విద్యార్థులు ఎంపిక**

ప్రభుత్వ సిటీ కాలేజీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం, టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతమైందని వైస్ ప్రిన్సిపాల్ డా. పి. శాంతి తెలిపారు. మొత్తం 216 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో 55 మంది సిటీ కాలేజీ విద్యార్థులు నియామక పత్రాలు అందుకున్నారు. టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందిస్తూ, అనంతరం వివిధ సంస్థలతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో మహీంద్ర, రిలయన్స్ జియో, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐఐఎఫ్ఎల్, వర్టెక్స్ జీఎస్టి అసోసియేట్స్ తదితర 13 సంస్థలు పాల్గొని విద్యార్థులను ఇంటర్వ్యూ చేశాయి. సంస్థ ప్రతినిధులు రాజీ (పుణె), దీపిక, మహ్ఫూజ్, సాయి కిరణ్ పాల్గొన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినందుకు సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతూ కామర్స్ విభాగాధ్యక్షులు డా. కె. మల్లికార్జున రావు, ఎస్. ఝాన్సీ రాణి తెలిపారు. రెండో దశలో మరికొంతమంది తృతీయ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ కొనసాగుతున్నదన్నారు. కామర్స్ అధ్యాపక బృందం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# ఎన్నికల రిసెప్షన్ కేంద్రం పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:** వేములవాడలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం రాత్రి పరిశీలించారు. జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో రాధాబాయితో కలిసి కేంద్రాన్ని సందర్శించారు. బ్యాలెట్ బాక్సులను వెంటనే స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, కౌంటింగ్ వరకు కట్టుదిట్టమైన భద్రత మధ్య భద్రపరచాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# సమయ సద్వినియోగమే దేశ అభివృద్ధికి బలమైన పునాది

**వేద న్యూస్ డెస్క్:**

దేశ ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత వంటి అంశాలు ముందుకు వస్తాయి. అయితే వీటన్నింటికీ ప్రాణం పోసేది ఉత్పాదకత. తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలు సాధించే సామర్థ్యమే నిజమైన ఉత్పాదకత. ఈ విలువను గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జాతీయ ఉత్పాదకత దినాన్ని పాటిస్తున్నారు. పని సామర్థ్యాన్ని పెంచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, దేశ అభివృద్ధిలో ప్రతి వ్యక్తి పాత్రను గుర్తు చేసే రోజు ఇది.

ఉత్పాదకత అనేది కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు. కార్యాలయాల్లో, వ్యవసాయ రంగంలో, విద్యాసంస్థల్లో, చిన్న వ్యాపారాల్లో ప్రతి రంగంలో ఇది కీలక అంశం. సమయపాలన, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, సాంకేతికత వినియోగం కలిసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. ఒక వ్యక్తి పనితీరు మెరుగుపడితే, అది సంస్థకు లాభం. సంస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు. పరిశ్రమల దృష్టిలో ఉత్పాదకత అంటే ఉత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు. నాణ్యత, సమర్థత, వ్యర్థాల నియంత్రణ కూడా అంతే ముఖ్యం. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత సాధించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యం పెరుగుతుంది. దేశ ఆర్థిక స్థిరత్వానికి ఇది కీలకం.

కార్యాలయాల్లో కూడా ఉత్పాదకత ప్రధాన చర్చగా మారుతోంది. ఉద్యోగులు కేవలం గంటలు గడపడం కాదు, ఫలితాలపై దృష్టి పెట్టాలి. సమయ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జట్టు భావన ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయి. పనివ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కూడా పనితీరును మెరుగుపరుస్తుంది. అలసటతో పని చేసే వ్యక్తి కంటే ఉత్సాహంతో పని చేసే వ్యక్తి ఎక్కువ ఫలితాలు ఇస్తాడు.

విద్యాసంస్థల్లో ఉత్పాదకత చర్చలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే యువతను తయారు చేయాలంటే, విద్యా వ్యవస్థలోనే ఉత్పాదకత విలువలు నాటాలి. జాతీయ ఉత్పాదకత దినం మనకు ఒక ముఖ్యమైన ప్రశ్నను వేస్తుంది. మనం చేసే ప్రతి పనిలో సమర్థత ఉందా? సమయాన్ని వృథా చేస్తున్నామా? వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతకడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థల పరంగా, దేశ స్థాయిలో మార్పు సాధ్యమవుతుంది.

ఉత్పాదకత అంటే కేవలం ఎక్కువ పని చేయడం కాదు. తెలివిగా పని చేయడం. సమయాన్ని గౌరవించడం. వనరులను కాపాడడం. నైపుణ్యాలను పెంపొందించడం. ఇవన్నీ కలిసినప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ప్రతి పౌరుడు తన పనిని సమర్థంగా నిర్వహించినప్పుడే జాతీయ స్థాయిలో ఉత్పాదకత పెరుగుతుంది. మొత్తంగా జాతీయ ఉత్పాదకత దినం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది ప్రతి రోజు ఆచరణగా మారాలి. వ్యక్తిగత క్రమశిక్షణ నుంచి దేశ ఆర్థికాభివృద్ధి వరకు, ఉత్పాదకతే ప్రధాన బలం. సమయాన్ని గౌరవించే సమాజమే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుఉత్పాదకత అనేది కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు. కార్యాల యాల్లో, వ్యవసాయ రంగంలో, విద్యాసంస్థల్లో, చిన్న వ్యాపారాల్లో ప్రతి రంగంలో ఇది కీలక అంశం. సమయపాలన, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, సాంకేతికత వినియోగం కలిసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. ఒక వ్యక్తి పనితీరు మెరుగుపడితే, అది సంస్థకు లాభం. సంస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు. స్థిరత్వానికి ఇది కీలకం.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 12, 2026

# తెలుగు తెరపై అందమైన వారసత్వం




**వేద న్యూస్ డెస్క్:**

సినీ పరిశ్రమలో స్టార్ హీరోల వారసులు హీరోలుగా ఎంట్రీ ఇవ్వడం కొత్త విషయం కాదు. అయితే స్టార్ హీరోల కూతుళ్లు హీరోయిన్‌గా రంగప్రవేశం చేయడం గతంలో చాలా అరుదుగా కనిపించేది. కాలం మారడంతో ఇప్పుడు సీనియర్ హీరోల కుమార్తెలు కూడా నటనపై ఆసక్తి చూపుతూ వెండితెరపై తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అలాంటి వారిలో ఇప్పుడు యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ కూడా చేరింది. ఐశ్వర్య అర్జున్ ఇప్పటికే 2013లోనే సినీ రంగంలో అడుగుపెట్టినప్పటికీ, తన కెరీర్‌ను ఆ స్థాయిలో కొనసాగించలేదు. తమిళం, కన్నడ భాషల్లో కొన్ని చిత్రాలు చేసిన ఆమె, ఇప్పుడు 'సీతా పయనం' సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 14న విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. టైటిల్ నుంచే ఒక స్వచ్ఛమైన ప్రేమకథ అనే భావన ప్రేక్షకుల్లో కలిగిస్తోంది. ఈ చిత్రానికి అర్జున్ స్వయంగా దర్శకత్వం వహించడం విశేషంగా మారింది. తండ్రి దర్శకత్వంలో ప్రేమకథా చిత్రంలో నటించడం ఒకవైపు సవాలుగా ఉన్నప్పటికీ, ఆయనను దర్శకుడిగా భావిస్తూ ఈ సినిమా చేసినట్లు ఐశ్వర్య తెలిపింది. అర్జున్ కూడా ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కథ, పాత్రల రూపకల్పనలో కసరత్తు చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. గ్లామర్ పరంగా ఐశ్వర్యకు మంచి మార్కులు పడుతున్నాయని ఇప్పటికే టాక్ వినిపిస్తోంది. ఇక నటన పరంగా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'సీతా పయనం' సినిమాతో ఐశ్వర్య అర్జున్ తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకుంటుందా లేదా అన్నది విడుదల తర్వాతే తేలనుంది.

# యోధుడిగా నిఖిల్ 'స్వయంభు' టీజర్ రిలీజ్




**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' టీజర్ విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా సమ్మర్ కానుకగా విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా వచ్చిన టీజర్‌లో నిఖిల్ క్రీస్తుశకం 985 కాలానికి చెందిన యోధుడిగా కనిపిస్తూ ఆకట్టుకున్నారు. భారీ సెట్లు, యుద్ధ సన్నివేశాలు, 3఑ విజువల్స్ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ గ్రాండ్ లుక్‌ను తీసుకొచ్చింది. 'కార్తికేయ-2' తర్వాత నిఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'స్వయంభు'పై మంచి అంచనాలు నెలకొన్నాయి.

# మెడిసిన్ పట్టా అందుకున్న శ్రీలీల




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. వెండితెరపై వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారింది. మెడికల్ విద్యలో భాగంగా ఎంబీబీఎస్ డిగ్రీను విజయవంతంగా పూర్తిచేసిన శ్రీలీల, తాజాగా జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమంలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నటిగా బిజీ షెడ్యూల్ మధ్య కూడా చదువును కొనసాగించడం సులభం కాదని తెలిసినా, లక్ష్యంపై దృష్టి పెట్టి శ్రీలీల కృషి చేసింది. గత ఏడాది చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, షూటింగ్‌ల మధ్య దొరికిన సమయాన్ని చదువుకు కేటాయిస్తూ మెడికల్ విద్యను పూర్తి చేసింది. ఆమె క్రమశిక్షణ, పట్టుదల ఇప్పుడు యువతకు ఆదర్శంగా నిలుస్తోంది

# వాలెంటైన్స్ డే స్పెషల్ 25 ఏండ్ల తర్వాత

## 'మనసంతా నువ్వే' రీ-రిలీజ్

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ లవర్ బాయ్‌గా గుర్తింపు పొందిన దివంగత నటుడు ఉదయ్ కిరణ్ కెరీర్‌లో క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'మనసంతా నువ్వే' చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. విడుదలై 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాన్ని వాలెంటైన్స్ డే స్పెషల్‌గా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించారు. ప్రేమకథల అభిమానులకు ఈ వార్త ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఎం.ఎస్. రాజు నిర్మాణంలో, వి.ఎన్. ఆదిత్య దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలైన సమయంలో భారీ విజయాన్ని సాధించడంతో పాటు ఉదయ్ కిరణ్‌ను స్టార్ హీరోగా నిలబెట్టింది. స్వచ్ఛమైన ప్రేమకథ, భావోద్వేగాలకు దగ్గరగా ఉండే కథనం, హృద్యమైన పాటలతో ఈ సినిమా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను మళ్లీ వెండితెరపై చూపించేందుకు నిర్మాతలు నిరంజన్ రెడ్డి, చైతన్యా రెడ్డి, రఘురామ్ రెడ్డి, రవికాంత్ రెడ్డి సంయుక్తంగా రీ-రిలీజ్ చేస్తున్నారు. రీ-రిలీజ్ సందర్భంగా ఉదయ్ కిరణ్ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన మేనకోడలు మహతి మాట్లాడుతూ, సినిమా విడుదలైనప్పుడు తనకు కేవలం రెండు నెలల వయస్సు మాత్రమేనని, ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత తన మామయ్య సినిమాను థియేటర్‌లో చూడటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని తెలిపింది. మరోవైపు మేనల్లుడు తేజ స్పందిస్తూ, అప్పట్లో తాను చిన్నవాడినని, ఇప్పుడు కూడా ప్రేక్షకులు ఉదయ్ కిరణ్‌పై చూపిస్తున్న ప్రేమ చూసి గర్వంగా ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటామని




చెప్పారు. రీమా సేన్, తనూ రాయ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ఆర్.పి. పట్నాయక్ అందించిన సంగీతం అప్పట్లో పెద్ద హిట్‌గా నిలిచింది. ఇప్పటికీ 'మనసంతా నువ్వే' పాటలు ప్రేమికుల ప్లేలిస్ట్‌లో ప్రత్యేక స్థానం దక్కించుకున్నాయి. నేటి తరం ప్రేక్షకులకు ఒక స్వచ్ఛమైన ప్రేమకథను మరోసారి పరిచయం చేస్తూ, వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా థియేటర్లలో మళ్లీ సందడి చేయనుంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు..

## అగ్రస్థానాల్లో వరుణ్, అభిషేక్





**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. బ్యాటర్ల జాబితాలో భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ 909 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో, పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని 25వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్ రెండో స్థానంలో ఉన్నాడు. శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ ఒక స్థానం ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరాడు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 11వ స్థానంలో నిలిచాడు. టీ20 ప్రపంచకప్‌లో ఒమన్‌పై అద్భుత ప్రదర్శన చేసిన జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా, పాకిస్థాన్ ఆటగాడు సైమ్ అయూబ్‌ను వెనక్కి నెట్టి ఆల్‌రౌండర్ల జాబితాలో తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బౌలింగ్‌లో కట్టుదిట్టంగా రాణించడంతో పాటు బ్యాటింగ్‌లోనూ జట్టుకు కీలక పాత్ర పోషించిన రజా మరోసారి తన సామర్థ్యాన్ని చాటుకున్నాడు.

# టీ20 వరల్డ్ కప్‌లో డబుల్ సూపర్ ఓవర్ థ్రిల్లర్..

## - ఆఫ్ఘన్‌పై సఫారీల సంచలన విజయం




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించిన అరుదైన పోరులో దక్షిణాఫ్రికా జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం ఏకంగా రెండు సూపర్ ఓవర్లు అవసరమవగా, చివరికి రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో సఫారీలు విజయం సాధించాయి. చివరి బంతి వరకు సాగిన ఈ ఉత్కంఠభరిత పోరు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. మ్యాచ్ టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌కు దారితీసింది. తొలి సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్థాన్ 17 పరుగులు చేయగా, ఛేదనలో దక్షిణాఫ్రికాకు చివరి బంతికి 6 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో ట్రిస్టన్ స్టబ్స్ సిక్సర్ బాదడంతో స్కోర్లు సమమయ్యాయి. దీంతో మ్యాచ్ రెండో సూపర్ ఓవర్‌కు వెళ్లింది. రెండో సూపర్ ఓవర్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ వరుస సిక్సర్లతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అనంతరం 24 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్థాన్ తరఫున రహ్మనుల్లా గుర్బాజ్ హ్యాట్రిక్ సిక్సర్లతో మ్యాచ్‌ను చివరి బంతి వరకు తీసుకెళ్లాడు. అయితే చివరి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆఫ్ఘన్ పోరాటం ముగిసింది. అంతకుముందు జరిగిన ప్రధాన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (59), ర్యాన్ రికెల్టన్ (61) అర్ధ సెంచరీలతో రాణించారు. లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ కూడా 187 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. గుర్బాజ్ (84) అద్భుతంగా పోరాడినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు. ఈ మ్యాచ్ టీ20 క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే థ్రిల్లర్‌గా నిలిచింది.

# ఇండియాతో మ్యాచ్‌కు ఒప్పుకున్న పాక్‌పై హర్భజన్ సెటైర్లు

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 వరల్డ్ కప్‌లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొదట భారత్‌తో మ్యాచ్ ఆడబోమని ప్రకటించి, తర్వాత మళ్లీ అంగీకరించడం పాక్ వైఖరిపై ప్రశ్నలు రేపుతోందని ఆయన అన్నారు. టోర్నమెంట్ ప్రారంభం కాకముందే ఈ మ్యాచ్‌పై తీవ్ర చర్చలు సాగాయి. రాజకీయ ఉద్రిక్తతలు, బోర్డు స్థాయి ప్రకటనలతో ఉత్కంఠ పెరిగింది. అయితే ఐసీసీ జోక్యంతో టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ అంగీకరించింది. ఈ నిర్ణయంపై స్పందించిన హర్భజన్ సింగ్, "రోజుకో మాట, గంటకొక స్టేట్‌మెంట్ ఎందుకు? ఇంత ఓవరాక్షన్ అవసరమా?" అంటూ ఎద్దేవా చేశారు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్థాన్‌కే ఎక్కువ నష్టమని, ఆ విషయం పీసీబీకి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. భారత్‌పై ఆధారపడకుండా పాకిస్థాన్ క్రికెట్ కొనసాగడం కష్టమని, కానీ భారత్ మాత్రం ఎప్పుడూ పాక్‌పై ఆధారపడదని అన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073